నేడు ఎమ్మెల్సీగా నవీన్‌కుమార్‌రెడ్డి ప్రమాణస్వీకారం

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ శాసనమండలి సభ్యుడు నవీన్‌కుమార్‌రెడ్డి గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆయన చేత ప్రమాణం చేయిస్తారు. నవీన్ కుమార్‌రెడ్డి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థిపై విజయం సాధించారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన తీన్మార్ మల్లన్న కూడా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

మహిళల భాగస్వామ్యం పెరగాలి: కూనంనేని

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : దేశంలో మహిళల రాజకీయ భాగస్వామ్యం పెరిగితేనే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో బుధవారం భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మహిళలపై హింసపై ఉద్యమించాలని డాక్టర్ రజిని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నాయకురాలు పద్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ సదాలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఛాయాదేవి, సహాయ కార్యదర్శి నళినీరెడ్డి పాల్గొన్నారు.

మోదీ వైఫల్యాలపైనే భగవత్ వ్యాఖ్యలు

- టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

హైదరాబాద్, జూన్ 12(నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ వైఫల్యాలను ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఎండగట్టారని, ఇందుకు ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలే నిదర్శనమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిజమైన ప్రజా సేవకుడికి అహంకారం ఉండదు.. అంటూ భగవత్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా మోదీని ఉద్దేశించి చేసిన వేనని అనుకుంటున్నారని తెలిపారు. మోదీ మ్యాజిక్‌కు కూడా పరిమితులు ఉండాలని సంఘ్ అధికార పత్రికలో కథనాలు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. పాత వారికే పాత శాఖలు కేటాయించి మోదీ తన అశక్తతను ప్రకటించుకున్నారని విమర్శించారు. చంద్రబాబు, నితీశ్ ఎక్కువకాలం మోదీతో పని చేయలేరని అభిప్రాయపడ్డారు.

నకిలీ పట్టాపాస్‌బుక్‌ల గుట్టురట్టు

- కాంగ్రెస్ నేత అరెస్ట్
- కోనరావుపేటలో కలకలం

కోనరావుపేట, జూన్ 12: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేటలో నకిలీ పాస్‌బుక్‌ల గుట్టురట్టయింది. వీటిని తయారు చేస్తున్న కాంగ్రెస్ నాయకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కాశీరామ్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా పని చేసేవాడు. గ్రామానికి చెందిన దండుగుల కనుకయ్యకు ప్రభుత్వ భూమి పట్టా చేస్తానని నమ్మించి 3 ఎకరాల పట్టా పాస్‌పుస్తకం తయారు చేసి రూ. లక్ష వసూలు చేశాడు. అతడి భార్య దండుగుల పోశవ్వ పేరు మీద గ్రామ శివారు సర్వే నంబర్ 367లో 3 ఎకరాల భూమి ఉన్నట్టుగా నకిలీ పాస్‌పుస్తకం తయారు చేసి ఇచ్చాడు. కాశీరామ్.. కనుకయ్యకు రెండేండ్ల క్రితం చూపించిన భూమిలో వారం క్రితం సాగుచేస్తుండగా అటవీ అధికారులు అడ్డుకున్నారు. దీంతో కనుకయ్య కాశీరామ్‌కు విషయం చెప్పగా తనకు సంబంధం లేదని దాటవేశాడు. డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరించాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిలో మార్పులు చేస్తున్నారని నమ్మించాడు. మరో రూ.20 వేలు ఇస్తే ధరణిలో నమోదు చేయిస్తానని నమ్మబలికాడు. ఇలా పలువురికి నకిలీ పట్టా పాస్‌బుక్‌లు తయారు చేసి ఇచ్చి డబ్బులు దండుకున్నాడు. బాధితుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్సై ఆంజనేయులు బుధవారం కాశీరామ్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతుల పట్టాదారు పాస్‌బుక్‌లు 10, టైటిల్ డీడీ ఆరు పుస్తకాలు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

వరినాట్లకు విత్తనాల కొరత

- విస్తృతంగా కురుస్తున్న వర్షాలు
- విత్తనాల కోసం రైతన్నల అగచాట్లు
- వనపర్తి సీడ్స్ కర్మాగారంలో విత్తనాలు
- పాలెం పరిశోధన కేంద్రంలో నో స్టాక్
- విత్తనాలకు 70 కి.మీ. ప్రయాణం
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో వరి విత్తనాలు లేవని ఏర్పాటు చేసిన బోర్డు

వనపర్తి, జూన్ 12 (నమస్తే తెలంగాణ): వానకాలం పంటల సీజన్ ప్రారంభమైంది. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు ముందుగానే కురుస్తున్నాయి. రైతులు విత్తనాల కొనుగోలు బాట పట్టారు. విత్తనాలను తెలంగాణ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిద్ధం చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు పంపిణీ చేయనున్నది. ఆయా జిల్లాల వ్యవసాయ శాఖల ఇండెంట్ మేరకు విత్తనాలు తరలించి రైతులకు విక్రయిస్తారు. నాసిరకం విత్తనాల బాధలు అధికం కావడంతో టీజీ సీడ్స్‌పై రైతులు నమ్మకం పెట్టుకున్నారు. వనపర్తి సీడ్స్ కర్మాగారంలో ఈ ఏడాది దాదాపు 22 వేల క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను ప్రాసెసింగ్ చేసేలా కార్యాచరణ చేపట్టారు. వీటిలో దాదాపు ప్రాసెసింగ్ పనులు పూర్తయ్యాయి. అయితే, ఇతర జిల్లాలకు సీడ్స్‌ను తరలించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

వరి విత్తనాలు లేవంటూ బోర్డు

ప్రస్తుత సీజన్‌కు సంబంధించి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి సమీపంలోని పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రంలోనూ విత్తనాలు అందుబాటులో ఉంచారు. కానీ పక్షం రోజుల నుంచి వరి విత్తనాలు అయిపోయాయని కేంద్రం నిర్వాహకులు బోర్డు పెట్టేశారు. సీజన్ మొదలుగాక ముందే విత్తనాలు అయిపోయాయని బోర్డులు పెట్టడంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. నాణ్యమైన విత్తనాల కోసం రైతులు ఎంత దూరమైనా వెళ్లేందుకు లెక్కచేయడం లేదు. పాలెం పరిశోధనా కేంద్రం వద్దకు తెలకపల్లి మండలం లక్నారం గ్రామానికి చెందిన రైతుల బృందం పది రోజులపాటు తిరిగింది. విత్తనాలు రావని తెలుసుకొని వనపర్తిలోని తెలంగాణ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేంద్రానికి వచ్చారు. వరి బీపీటీ రకం 40 బస్తాల విత్తనాలను కొనుగోలు చేసి ఆటోలో తీసుకెళ్లారు. ఇక్కడి నుంచి వారి గ్రామానికి దాదాపు 70 కిలోమీటర్లు దూరం ఉంటుంది. లక్నారం గ్రామం మండల కేంద్రమైన తెలకపల్లికి కేవలం 9 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఇక్కడికి ప్రభుత్వమే విత్తనాలు సరఫరా చేయాల్సి ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యంతో వనపర్తి సెంటర్‌ను ఆశ్రయించామని రైతులు నిరంజన్, శంకర్రావు, ఎల్లయ్య, రామారావు, హనుమంత్ రెడ్డి తెలిపారు.

ముందే బోర్డు పెట్టిండ్రు

గతంలో తెల్కపల్లిలోనే మాకు వరి విత్తనాలు అందుబాటులో ఉండేవి. అక్కడ లేకుంటే పాలెంలోనైనా దొరికేవి. ఈసారి అక్కడ కూడా విత్తనాలు అయిపోయావని బోర్డు పెట్టేశారు. ఇక మాకు దిక్కుతోచలేదు. ఒక్క కుంట కూడా నీటితో నిండలేదు.. చెరువుల్లోకి నీళ్లే రాలేదు.. కాల్వలు పారనేలేదు. కానీ విత్తనాలు అయిపోయాయని సర్కారోళ్లు బోర్డు పెట్టిండ్రు. నాణ్యమైన విత్తనాల కోసమే 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న వనపర్తి సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు వెళ్లి కొనుగోలు చేశాం. అంత దూరం వెళ్లడం మాకు ఆర్థికంగా భారమే.. అయినా తప్పదు.

– నిరంజన్, లక్నారం, తెలకపల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

విత్తనాలు సిద్ధం

తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నిర్ణయించిన లక్ష్యాలను గడువులోపు సిద్ధం చేశాం. మాకిచ్చిన ఇండెంట్ మేరకు విత్తనాలను రెడీగా ఉంచాం. ప్రధానంగా వరి ప్రాసెసింగ్, ప్యాకింగ్ పూర్తయింది. ఆయా ప్రాంతాల వారీగా వాహనాలు వస్తే వరి వంగడాలను పంపిస్తున్నాం. ఇక్కడి నుంచి దాదాపు 22 వేల క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను ఈ ఏడాది వానకాలంలో రైతుల అవసరాలకు అందించాలన్న లక్ష్యంగా నిర్ణయించాం.

– రాజీవ్, మేనేజర్, టీజీఎస్‌డీసీ, వనపర్తి

విత్తనాలు ఇయ్యకుంటే ఎట్లా?

వరి విత్తనాలు ఇయ్యకుంటే సాగు పనులు ఎలా చేయాలి. మంచి విత్తనమైతే పంట బాగా వస్తుంది. ప్రైవేటులో కొందామంటే నమ్మకం లేదు. పది రోజుల నుంచి విత్తనాల కోసం పాలెం సెంటర్‌కు తిరిగి వేసారినం. వస్తాయంటే ఎదురు చూసినం. అయినా విత్తనాలు లేవని బోర్డు పెట్టిండ్రు. ఎంత కష్టమైనా నాణ్యమైన విత్తనాలు వనపర్తిలో లభిస్తాయంటే వనపర్తికి వచ్చాం. కాంగ్రెస్ సర్కారు వచ్చిందిగానీ.. రైతులకు ఫలితం లేదు. ఇట్ల విత్తనాలకు ఇంత దూరం మేం ఎప్పుడు రాలె.

– ఎల్లయ్య, లక్నారం, తెలకపల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

కౌలు రైతు ఆత్మహత్య

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విషాదం

కాటారం, జూన్ 12: కాలం కలిసి రాక.. సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. కాటారం మండలం మద్దులపల్లికి చెందిన రైతు గడ్డం చంద్రు (34) నాలుగేండ్లుగా గ్రామంలోని ఓ ఇద్దరి రైతులకు చెందిన 8 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నాడు. కాలం కలిసిరాక పంట దిగుబడి తగ్గడంతో రూ.10 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదంటూ తరచూ భార్యకు చెప్పుకొని బాధపడేవాడు. ఈ క్రమంలో ఈనెల 8న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే వచ్చి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. కాగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కాటారం ఎస్సై తెలిపారు.

డిజిటల్ క్రాప్ సర్వే!

- పంటల నమోదుకు కొత్త విధానం
- డిజిటల్ సర్వేపై వ్యవసాయ శాఖ కసరత్తు
- నిరుడు పైలట్ ప్రాజెక్టుగా 16 మండలాల్లో..
- ఈ సీజన్ నుంచి రాష్ట్రమంతా అమలుకు ప్రణాళిక

హైదరాబాద్, జూన్ 12(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పంటల సాగు నమోదును మరింత కచ్చితంగా లెక్కించేందుకు కొత్త విధానం అమలుకు వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగానే 'డిజిటల్ క్రాప్ సర్వే'ను చేయనున్నది. ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని ఇప్పటికే కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 16 మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా డిజిటల్ క్రాప్ సర్వేను అమలు చేసింది. ఈ వానకాలం సీజన్ నుంచి పూర్తి స్థాయిలో అమలు చేయాలని కేంద్రం ఆదేశించింది. దీంతో డిజిటల్ సర్వేను అమలు చేయాలా లేక పాత పద్ధతిలోనే చేయాలా అనే అంశంపై వ్యవసాయ శాఖ చర్చిస్తున్నది. వీలైతే వచ్చే ఏడాది నుంచి అమలుకు అనుమతించాలని కేంద్రాన్ని కోరాలని భావిస్తున్నది. కేంద్రం అనుమతిస్తే డిజిటల్ క్రాప్ సర్వే వచ్చే ఏడాదికి వాయిదా పడుతుంది లేనిపక్షంలో ఈ సీజన్ నుంచి అమల్లోకి రానున్నది.

ప్రతి రైతు, ప్రతి పంట ఫొటో...

పంట సాగు విస్తీర్ణం లెక్కింపులో ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం, డిజిటల్ క్రాప్ సర్వే దాదాపుగా ఒకే విధంగా ఉన్నాయి. డిజిటల్ క్రాప్ సర్వేలో అదనంగా పంట ఫొటోలు, రైతు ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. తద్వారా ఏ రైతు ఏ పంట వేశారనేది ఆధారాలతో ఉంటుందనేది అధికారుల అభిప్రాయం. కేంద్రం ఆదేశాలతో డిజిటల్ క్రాప్ సర్వేను ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌వంటి రాష్ట్రాలు పూర్తిస్థాయిలో అమలు చేస్తుండగా మరికొన్ని రాష్ట్రాల్లో పాక్షికంగా అమలు చేస్తున్నాయి. ఈ డిజిటల్ క్రాప్ సర్వే అమలుకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం అందించనున్నది.

దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో...

పంట సర్వే కోసం కేసీఆర్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన విధానం దేశంలోనే అత్యుత్తమంగా నిలిచింది. టెక్నాలజీ సాయంతో పంట సర్వే విధానాన్ని దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసింది. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో పంట సర్వేను మాన్యువల్‌గా చేసేవాళ్లు. ఈ విధానానికి స్వస్తి చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం దీన్ని ఆన్‌లైన్ చేసింది. ఆ తర్వాత మరింత మెరుగ్గా నిర్వహణకుగానూ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో ఫలానా సర్వే నెంబర్‌లో పంట సాగును నమోదు చేయాలంటే కచ్చితంగా ఆ అధికారి ఆ సర్వే నంబర్‌లో ఉండాల్సిందే. ఆ సర్వే నంబర్‌కు 50-100 మీటర్ల విస్తీర్ణంలో ఉంటేనే ఆ వివరాలు యాప్‌లో నమోదవుతాయి. దీంతో పంట సాగు విస్తీర్ణం కచ్చితత్వంతో నమోదయ్యేది.

'ధరణి'పై రేపు వీడియో కాన్ఫరెన్స్

- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై సుదీర్ఘంగా సమీక్షించనున్న సీసీఎల్ఏ

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ధరణి పెండింగ్ సమస్యల పరిష్కారంపై సీసీఎల్ఏ అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఇప్పటివరకు జరిగిన పురోగతిని సమీక్షించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరుదశల్లో సమీక్ష జరుగనున్నది. కలెక్టర్లతోపాటు అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తాసిల్దార్లు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

స్పెషల్ డ్రైవ్ ఉన్నట్టా? లేనట్టా?

ధరణిలో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. తొమ్మిది రోజుల్లో రెండున్నర లక్షల దరఖాస్తులు పరిష్కరిస్తామని హడావుడి చేసింది. తర్వాత గడువును మరికొన్ని రోజులు పొడిగించింది. చివరికి ఎన్నికల కోడ్ పేరుతో డ్రైవ్‌ను మధ్యలోనే నిలిపివేసింది. దరఖాస్తుల పరిష్కారానికి ఎన్నికల కోడ్‌తో సంబంధం లేదని నిపుణులు చెప్పారు. ఈ విషయంలో ధరణి కమిటీ సభ్యులకు, రెవెన్యూ ఉన్నతాధికారులకు మధ్య వాగ్వాదం కూడా జరిగినట్టు సమాచారం. తాజాగా పెండింగ్ దరఖాస్తులను వేగంగా పూర్తి చేయాలంటూ ఉన్నతాధికారులు హడావుడి చేస్తున్నారు. గతంలో ఆపిన స్పెషల్ డ్రైవ్‌ను తిరిగి కొనసాగిస్తున్నారా? లేదా సాధారణ ప్రక్రియగా పూర్తిచేస్తున్నారా? అని ప్రశ్నిస్తున్నారు. తమకు స్పెషల్ డ్రైవ్ అని ఏమీ చెప్పలేదని, దరఖాస్తులు పరిష్కరించాలని మాత్రమే చెప్పారని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. స్పెషల్ డ్రైవ్ అని 3నెలల సమయం ఎందుకు వృథా చేశారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కరీంనగర్ జిల్లా చొప్పదండిలో ఆర్టీసీ కండక్టర్‌తో ప్రయాణికురాలి వాగ్వాదం

పుట్‌బోర్డు ప్రయాణం.. ఠాణాకు చేరిన పంచాయితీ

చొప్పదండి, జూన్12: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలికి, కండక్టర్‌కు మధ్య జరిగిన గొడవ పోలీస్టేషన్ దాకా వెళ్లింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. మంచిర్యాల నుంచి కరీంనగర్‌కు వస్తున్న బస్సు మహిళలతో కిక్కిరిసిపోయింది. మార్గమధ్యంలో చొప్పదండి బస్‌స్టేషన్‌లో బస్సు ఆపగా.. మరికొందరు మహిళలు బస్సు ఎక్కారు. బస్సు మెట్లపై ఎవరూ ఉండొద్దని, లోపలికి రావాలని కండక్టర్ పిలువగా.. అందులోని ఓ ప్రయాణికురాలు కండక్టర్‌తో వాగ్వాదానికి దిగింది. ఆ ప్రయాణికురాలు ఎంతకూ వినకపోవడంతో డ్రైవర్ బస్సును ఆపారు. ఈ క్రమంలో గొడవ పెద్దదై.. పంచాయితీ చొప్పదండి ఠాణాకు చేరింది. పోలీస్ సిబ్బంది వారితో మాట్లాడి గొడవను పరిష్కరించారు. కాంగ్రెస్ సర్కారు తెచ్చిన ఫ్రీ బస్సు పథకంతో.. బస్సుల్లో సీట్లే లేకుండా పోయాయని, చాలా ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ప్రయాణికులు మండిపడ్డారు. బస్సులు సరైన సమయానికి రావడం లేదని, వచ్చినా కిక్కిరిసిపోవాల్సి వస్తున్నదని, వెంటనే బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ బస్సు కిందపడ్డ మహిళ

- నుజ్జునుజ్జయిన ప్రయాణికురాలి రెండు కాళ్లు

ఆర్మూర్‌టౌన్, జూన్ 12: ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో పట్టుతప్పి కిందపడిన మహిళ కాళ్ల పైనుంచి టైర్లు వెళ్లడంతో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. నిర్మల్‌కు చెందిన సుజాత బుధవారం ఆర్మూర్‌కు వచ్చారు. తిరిగి వెళ్లేందుకు బస్టాండ్‌కు రాగా.. అప్పటికే నిజామాబాద్ నుంచి నిర్మల్ వెళ్లే బస్సు సిద్ధంగా ఉంది. నిర్మల్ డిపో బస్సు.. ప్లాట్‌ఫారం నుంచి రివర్స్‌లో వెళ్తుండగా సుజాత బస్సు ఎక్కే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో సుజాత కిందపడిపోగా.. బస్సు టైర్లు ఆమె కాళ్ల పైనుంచి వెళ్లాయి. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. బాధితురాలిని దవాఖానకు తరలించిన పోలీసులు.. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ధర్నాచౌక్‌లో దీక్ష చేస్తున్న టీజీఎస్ఆర్‌టీసీ బహుజన్ వర్కర్స్ యూనియన్ నాయకులు...

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- బహుజన్ వర్కర్స్ యూనియన్ దీక్ష

కవాడిగూడ, జూన్ 12: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని టీజీఎస్ఆర్టీసీ బహుజన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలని కోరారు. ఆధార్ కార్డు తరహాలో ప్రయాణికులకు ఆర్టీసీ ఐడీ కార్డు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం టీజీఎస్ఆర్టీసీ బహుజన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ ఎంవీ యాక్ట్ 1961ని ఆర్టీసీలో అమలు చేయాలని కోరారు. ఆర్టీసీలో సస్పెండ్, రిమూవ్ అయిన కార్మిక సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన వారికి బకాయిలు చెల్లించాలని, 2017కు సంబంధించిన పే స్కేలు, అలవెన్స్‌లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బీ నాగేశ్వర్, యాదయ్య, ఎం లీలారావు, రవి కిరణ్, బీ శ్రీనివాస్, సీహెచ్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులపైనే 'టోల్' భారం

మొదటిపేజీ తరువాయి...

బస్సుల్లో ప్రయాణించే పురుషులు మాత్రమే భరించాల్సి ఉంటుంది. నిత్యం 30 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. నగరంలో 12 లక్షల మంది, పల్లెవెలుగు బస్సుల్లో 12 లక్షల మంది చొప్పున ప్రయాణిస్తున్నారు. టోల్ సెస్ పెంపు భారం సుమారు 6 నుంచి 10 లక్షల మందిపై అదనపు భారం పడుతుందని అంచనా. ఈ పెంపుపై ఆర్టీసీ ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం. పెరిగిన టోల్ చార్జీతో ప్రయాణికులపై అదనపు భారం వేసిన ఆర్టీసీకి మాత్రం అదనపు ఆదాయం వస్తుంది. ఈ నేపథ్యంలో బస్సు సర్వీసుల వేళల్లోనూ ఆర్టీసీ అధికారులు మార్పులు చేశారు. టోల్‌చార్జీలు పెరిగినందున టికెట్‌లో టోల్‌చార్జీ పెరిగింది తప్ప.. టికెట్ రేటు కాదని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. సాధారణ చార్జీలు యథాతథంగానే ఉన్నాయని,సాధారణ రూట్లలో టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పులు లేవని పేర్కొన్నది.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా జయారెడ్డి

హైదరాబాద్, జూన్ 12(నమస్తే తెలంగాణ): యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తూర్పు జయారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెను నియమిస్తూ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జయారెడ్డి సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి కుమార్తె.

ఏపీకి ప్రత్యేక హోదా ముగిసిపోయిన అంశం

- కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : ఏపీకి ప్రత్యేక హోదా ముగిసిపోయిన అంశమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఏపీకి ప్రత్యేక ప్యాకేజి ఇచ్చిందని తెలిపారు. విభజన చట్టం హామీలను కూడా అమలు చేసిందని పేర్కొన్నారు. బుధవారం ఏపీలో సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు. రాబోయే ఐదేళ్లు కూటమితో కలిసి ముందు కెళ్తామని స్పష్టం చేశారు.

చెరువు కట్టనూ కూలగొట్టి!

- బంకమట్టి అక్రమంగా తరలింపు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పాలాల పేరుతో మట్టి దందా
- రోజుకు రూ. లక్షల్లో అక్రమార్జన
- పట్టించుకోని జిల్లా అధికారులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని సోలిపేట చెరువులో మట్టిని తోడుతున్న హిటాచీ

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 12 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మట్టి మాఫియా రెచ్చిపోతున్నది. పట్టపగలే చెరువులు, కుంటల్లో నుంచి బంకమట్టిని అక్రమంగా తరలిస్తున్నది. కొమాండ్ల చెరువు కట్టమట్టిని సైతం తోడేసింది. పంట పొలాల్లో ఒండ్రుమట్టి పోసుకుంటామని అనుమతులు తీసుకొని కొందరు, ఎలాంటి అనుమతులు లేకుండా మరికొందరు మట్టి అమ్మకాలకు పాల్పడుతున్నారు. ప్రైవేటు వెంచర్లు, ఇండ్ల స్థలాలకు పెద్దమొత్తంలో తరలిస్తున్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో రాత్రి వేళ మట్టి దందా గుట్టుగా కొనసాగుతుండగా, భూపాలపల్లి మండలంలో మాత్రం పట్టపగలే చెరువు మట్టిని డంపింగ్ కేంద్రాలకు తరలిస్తూ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సవాల్ విసురుతున్నారు. భూపాలపల్లి మండలంలోని సోలిపేట చెరువు మట్టిని తోడేస్తున్నారు. నెల రోజుల క్రితం రాత్రివేళల్లో మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా ఐబీ అధికారులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు సైతం జేసీబీని స్వాధీనం చేసుకున్నారే తప్ప వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దాంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోయి పట్టపగలే చెరువు నుంచి మట్టిని తరలిస్తున్నారు. గోరికొత్తపల్లి మండలంలోని రామయ్యకుంట, లంబడికుంట, కుదురుకుంట, రసల్‌కుంటల్లో అక్రమార్కులు రాత్రి వేళ జేసీబీలతో మట్టిని అక్రమంగా తరలించారు. రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. కొమాండ్ల చెరువు కట్ట మట్టిని సైతం తోడేశారని రైతులు మొత్తుకున్నా స్పందన కరువైంది. రోజుకు వందల ట్రాక్టర్లతో ఈ దందా జరుపుతూ రూ. లక్షల్లో అక్రమంగా ఆర్జిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

ఇసుక మాఫియాను మించి